
ఈశ్వరప్పపై ఆరేళ్ల సస్పెన్షన్ వేటు

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో శివమొగ్గ నుంచి రెబెల్‌గా పోటీ చేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్పపై బీజేపీ అధిష్ఠానం ఆరేళ్లపాటు సస్పెన్షన్ వేటు వేసింది. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సమితి అధ్యక్షుడు లింగరాజ పాటిల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాని మోదీయే కాదు బ్రహ్మదేవుడే వచ్చినా పోటీ చేయడం ఖచ్చితమని ఈశ్వరప్ప ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చర్యలు తీసుకుంటూ బీజేపీ రాష్ట్ర విభాగం ఆదేశాలు జారీ చేసింది. రెబెల్‌గా పోటీ చేయడం క్రమశిక్షణను ఉల్లంఘించినట్లేనని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



బరిలో .. 227 మంది

● ముగిసిన రెండో విడత నామినేషన్ల ఉపసంహరణ

● చివరి రోజు కీలక పరిణామాలు ● కేంద్రమంత్రి జోషికి బిగ్..రిలీఫ్ ● పోటీ నుంచి తప్పుకున్న దింగాలేశ్వర స్వామి ● అలక వీడని ఈశ్వరప్ప ● శివమొగ్గలో త్రిముఖ పోటీ అనివార్యం



బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో విడత 14 లోక్‌సభ స్థానాలకు కీలకఘట్టమైన నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. సోమవారం ఉపసంహరణ ముగిసే సరికి 45మంది తమ నామినేషన్లను రద్దు చేసుకున్నారు. బరిలో 227మంది అభ్యర్థులు మిగిలారు. వీరిలో 206మంది పురుషులు కాగా 21మంది మహిళలు ఉన్నారు. అత్యధికంగా దావణగెరెలో 30మంది శివమొగ్గలో 23మంది, బాగల్కోటెలో 22మంది కాగా చిక్కోడిలో 18, బెళగావిలో 13, కలబురగిలో 14, బీదర్‌లో 18, కొప్పళలో 19, బళ్ళారిలో 10మంది హావేరిలో 14మంది ధారవాడలో 17మంది, ఉత్తరకన్నడ 13మంది కాగా విజయపుర (బిజాపూర్), రాయచూరులలో 8మంది చొప్పున ఉన్నారు. 335మంది అభ్యర్థులు 503 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా పరిశీలనల తర్వాత 394 సక్రమమని నిర్ధారించారు. 109 నామినేషన్లు తిరస్కరించగా 272మంది బరిలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత 227మంది అధికారికంగా పోటీలో నిలిచినవారయ్యారు. సురపుర శాసనసభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో 6 మంది అభ్యర్థులయ్యారు. బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు నలుగురు ఇండిపెండెంట్‌లు ఉన్నారు. ఇక్కడ మహిళా అభ్యర్థులు పోటీ చేయలేదు.

బీజేపీలో కీలక పరిణామాలు

మే 7న పోలింగ్ జరిగే 14 లోక్‌సభ స్థానాల ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఉపసంహరణ వేళ కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ధారవాడ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై దింగాలేశ్వరస్వామి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేయడంతో పార్టీలో ఆందోళనగా మారింది. ఆదివారం రాత్రి దాకా నామినేషన్ ఉపసంహరించేది లేదని తేల్చి చెప్పిన దింగాలేశ్వరస్వామి అనూహ్యంగా సోమవారం యూటర్న్ తీసుకున్నారు. నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ప్రహ్లాద్‌జోషికి రిలీఫ్ లభించినట్లయ్యింది. ఇక శివమొగ్గ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఈశ్వరప్ప నిర్ణయంలో మార్పు లేదు. ఆయన చివరి రోజు తీసుకునే నిర్ణయం కోసం పార్టీ వర్గాలు ఎదురు చూశాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణయంలో మార్పు ఉండదని మరోసారి స్పష్టం చేశారు. ఈమేరకు ఆయన బరిలో ఉండడంతో ఎన్నికల కమిషన్ చెరుకుగడతో ఉండే రైతు చిహ్నం కేటాయించారు. దీంతో శివమొగ్గలో త్రిముఖ పోటీ అనివార్యమైంది. ఇక్కడనుంచి బీజేపీ అభ్యర్థిగా యడియూరప్ప కుమారుడు, సిట్టింగ్ ఎంపీ రాఘవేంద్ర బరిలో ఉండగా కాంగ్రెస్ నుంచి గీతా శివరాజ్‌కుమార్ పోటీలో ఉన్నారు. ఈశ్వరప్ప పోటీ చేయడంతో ఇక్కడ ఎన్నిక రసవత్తరమైంది. ఇక దావణగెరెలో టిక్కెట్ లభించలేదని వినయ్‌కుమార్ పోటీ చేయడం కాంగ్రెస్‌కు సవాల్‌గా మారింది.



క్యాడర్..!



● కాంగ్రెస్ నేతలకు ఎన్నికల భయం ● ఫలితాలు తారుమారైతే పదవికి గండమే.. ● మంత్రులకే కాదు... ఎమ్మెల్యేలకూ టార్గెట్ ● రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలవాల్సిందే ● ఇన్‌చార్జ్‌లతో సీఎం, డీసీఎంల సమీక్ష

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీలో ప్రతి స్థాయి నాయకుడికి తంటాలు తెచ్చి పెడుతున్నాయి. రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో గెలుపే ధ్యేయంగా ఉన్న పార్టీ అధిష్ఠానం క్యాడర్‌ను పరుగులు పెట్టిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు సహా ప్రతి ఒక్కరికీ టార్గెట్ నిర్ణయిస్తోంది. ఇప్పటివరకు మంత్రులకు మాత్రమే ఎన్నికల టార్గెట్ అందరూ అనుకున్నారు. తాజాగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు కొత్త మెలిక పెట్టా రు. మేం కష్టపడి చెమటోడుస్తుంటే ఎమ్మెల్యేలు చెట్టాపట్టాల్ వేసుకుంటే సరిపోదనే కొత్త టాస్క్ పెట్టారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ ఎక్కువ మెజారిటీ సాధించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు సూచించారు. ఎక్కడ వైఫల్యం చెందినా అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. శాసనసభ ఎన్నికల తరహాలోనే లోక్‌సభ ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలు గెలవాలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. సీఎం, డీసీఎంలు ఇప్పటికే మంత్రులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం గరిష్ఠంగా కృషి చేయాలని, ఎలాంటి కుంటిసాకులు సరికాదని, ఫలితాల తర్వాత అన్నింటినీ సమీక్షిస్తామని సూచించారు. పార్టీ అధిష్ఠానం నుంచి ఇటువంటి సందేశాలు రావడంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు తమ బాధ్యతను ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు అప్పగించారు. గ్రామస్థాయి నాయకుడి నుంచి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో ప్రతిరోజూ వారి పరిధిలో ఏం జరుగుతోందో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు తెలుసుకోవాలనే ఆదేశాలతో సతమతమవుతున్నారు. ప్రతి శాసనసభ స్థానం నుంచి 25-30 వేల మెజారిటీ సాధించడం తప్పనిసరి. ఇందుకు ఎమ్మెల్యే, మాజీలదే బాధ్యత అవుతుంది. ఎటువంటి నెపాలు ఉండరాదు. ఎన్నికల్లో సంపూర్ణంగా పనిచేయాలి. అధిష్ఠానం టాస్క్‌లను సమర్థవంతంగా పూర్తి చేయాలి. అధిష్ఠానం అన్నిటినీ గమనిస్తోంది. పార్టీకి వెనుకడుగు అయితే ఎంతటివారు అయినా చర్యలు ఉంటాయనే సందేశం ఇస్తున్నారు.

● ఆరుగురు మంత్రులు తమ పిల్లలను అభ్యర్థులు చేశారు. మీ వారసుల ఎదుగుదలకోసం మేం ఎందుకు చెమటోడ్చాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మరో ముగ్గురు మంత్రులు సమీప బంధువులకు టిక్కెట్‌లు సాధించుకున్నారు. ఇది ఒక రకంగా ఎమ్మెల్యేల అసంతృప్తికి కారణమవుతోంది. ఎన్నికల్లో మెజారిటీ సాధించకపోయినా సక్రమంగా వ్యవహరించకపోయినా మంత్రులు పదవులు వదులుకోవాల్సి ఉంటుందని ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే ఇటీవలే బహిరంగంగా ప్రకటించారు. అంతకు ముందు నుంచే ఈ అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

● ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి మంత్రులకు ముచ్చెమటలు పడుతున్నాయి. 3 నెలల ముందే కేపీసీసీ దాదాపు 9మంది మంత్రులకు ఎంపీ టిక్కెట్‌లు ఇచ్చేలా ఓ నివేదిక అధిష్ఠానానికి పంపింది. ఎన్నికల్లో కష్టపడి ఆరు నెలలు కాకనే మరోసారి అంటే సాధ్యం కాదని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి మహదేవప్పకు చామరాజనగర టిక్కెట్ ఇవ్వాలనే ప్రస్తావన రాగా నాకంటే సీఎం సిద్దరామయ్య, డీసీఎంలు మంచి అభ్యర్థులని బహిరంగంగా ప్రకటించిన విషయం తెలిసిందే. 135 స్థానాల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ 34మంది మంత్రులను వెంటనే నియమించుకుంది. ఆ తర్వాత మరో 35మంది ఎమ్మెల్యేలకు కీలకమైన బోర్డులు, కార్పొరేషన్‌లు, మరో 35మందికి తాలూకా స్థాయి నాయకులకు హోదాలు ఇచ్చింది. రాజకీయ, ఆర్థిక సలహాదారులంటూ మరికొందరికి పదవులు కట్టబెట్టింది. ఇలా శాసనసభలో ఉండే 135మందిలో 85మందికిపైగా కీలకమైన హోదాలలో ఉన్నారు. వారంతా ఎన్నికలు ముగిశాక మా పదవులు ఉంటాయా లేదా అనే డోలాయమానంలో పడ్డారు.



నేహా హత్య కేసు సీఐడీకి..



శివమొగ్గలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

● విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు : సీఎం సిద్దరామయ్య ● రెండేళ్ళుగా నేహాకు మతమార్పిడి వేధింపులు ● తండ్రి నిరంజన్ హీరేమఠ్ ఆవేదన ● హత్యను ఖండిస్తూ ముస్లింల ఆధ్వర్యంలో హుబ్బళ్ళి బంద్



మైసూరు నిరసనలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దారుణంగా హత్యకు గురైన విద్యార్థిని నేహా హిరేమఠ దారుణహత్య కేసుపై ప్రభుత్వం స్పందించింది. హత్య కేసును సీఐడీకి అప్పగిస్తున్నట్లు సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. శివమొగ్గలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేహా హత్య కేసును సీఐడీ దర్యాప్తు చేస్తుందన్నారు ఇందుకోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గడువులోగానే చార్జ్‌షీట్ దాఖలు చేసి కేసును పరిష్కరింపచేస్తామని అందుకోసమే ప్రత్యేక కోర్టు ఏర్పాటు కానుందన్నారు. నేహా కుటుంబ సభ్యులను త్వరలోనే పరామర్శిస్తానన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పార్టీ కార్యకర్తలు వెళ్లారని, త్వరలోనే న్యాయ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ వారి కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు.

కాగా నేహా పోస్టుమార్టం నివేదిక వచ్చింది. హత్య జరిగినప్పుడు నిందితుడు ఫయాజ్ 9సార్లు చాకుతో పొడిచాడని పోలీసులు భావించారు. అయితే నివేదికలో 14సార్లు పొడిచినట్లు తేలింది. గొంతు భాగంలో తీవ్రమైన చాకుదాడి ఉందని, ఆ తర్వాత ఛాతీతోపాటు ఇతర శరీరభాగాల్లో పొడవడంతో నరాలు తెగి తీవ్ర రక్తస్రావం జరిగినట్లు నివేదికలో తేలింది. నేహా తండ్రి నిరంజన్ హిరేమఠ సోమవారం మీడియాతో మాట్లాడుతూ నేహాను మతమార్పిడి చేయాలని రెండేళ్లుగా ప్రయత్నాలు జరిగాయని బహిరంగం చేశారు. విషయం తెలియగానే నేహా ఫయాజ్‌కు దూరంగా ఉంటూ వచ్చిందన్నారు. నేహాను మతమార్పిడి చేయడమే వారి ముఖ్య ఉద్దేశమని ఆరోపించారు. పోలీసులు ప్రభుత్వం చేతుల్లో బొమ్మల్లా మారారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. నేహా హత్యకు గురై నాలుగు రోజులైందని, అదే రోజు ఫిర్యాదు చేశామని, పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిందని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నేహాకు సంబంధించిన అన్ని మెసేజ్‌లు పరిశీలించానన్నారు. మతమార్పిడి వారి లక్ష్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తమ ఇంటికి వచ్చి పోలీస్ కమిషనర్‌ను రప్పించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారని అయినా కేసులో పురోగతి లేదన్నారు. మీకు అండగా ఉంటామనే హామీ తప్ప వారు ఏ విధంగానూ స్పందించలేదన్నారు. ఇంతటి భయానక హత్య కేవలం ఒకరితో సాధ్యం కాదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందర్నాను. నేహా కదలికలపై బ్యాచ్‌మేట్‌లు, కొందరు విద్యార్థులు సమాచం ఇచ్చారన్నారు. నేహా కాల్ డిటైల్స్‌ను ఎందుకు తనిఖీ చేయలేదన్నారు. సీఎం, హోం మినిస్టర్‌లకు హత్య విషయంలో తప్పుగా సమాచారం ఇచ్చిన కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయించాలన్నారు. సీఐడీ ద్వారా దర్యాప్తు చేయించాలన్నారు.

అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో హుబ్బళ్ళి బంద్

ఎంసీఏ విద్యార్థిని నేహా దారుణహత్యను ఖండిస్తూ అంజుమన్ - ఏ - ఇస్లాం విద్యాసంస్థ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిపారు. నెహ్రూ కళాశాల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. నిందితుడు ఫయాజ్‌ను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కాగా హుబ్బళ్ళిలో సోమవారం ముస్లిం వ్యాపారులు బంద్ చేసి నేహా మృతికి సంతాపం తెలిపారు. బెళగావిలో భారీ ర్యాలీ జరిగింది. జాగృత మహిళా వేదిక నేతృత్వంలో వేలాదిమంది మహిళలు నిరసన, మానవహారం చేపట్టారు. రాణి చెన్నమ్మ సర్కిల్‌లో ఆందోళన చేసినవారు నేహాను హత్య చేసినవాడిని ఉరి తీయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. నగరంలో భారీ ర్యాలీ జరిగింది. సేవాభారతి ముఖ్యులు శిల్ప పర్నేకర్ మాట్లాడుతూ ప్రేమకు చిహ్నం తాజ్‌మహల్ అని అయితే ఇలాంటి దారుణాలు కాదన్నారు. ఓ విద్యార్థిని హత్యకు గురైతే బాధ్యత కల్గిన సీఎం, హోం మంత్రులు పరుషంగా మాట్లాడడం బాధాకరమన్నారు. మునవళ్ళి గ్రామంలో ఓ యువతికి పని కల్పిస్తామని అత్యాచారం చేసి మతమార్పిడికి ప్రయత్నించి హింసించినా తగిన చర్యలు తీసుకోలేదన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

నేహా హత్యను ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు చోట్ల నిరసనలు సాగాయి. మైసూరులో నిరసనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర నేతృత్వం వహించారు. అలాగే తుమకూరులో సాగిన నిరసనకు ప్రతిపక్షనేత ఆర్ అశోక్ ముఖ్యులుగా పాల్గొన్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.



బంధువులు... బలయ్యారు..

● తల్లిదండ్రుల హత్యకు కన్నకొడుకే రూ.65 లక్షల సుపారీ ● వారికి బదులుగా బంధువులను కడతేర్చిన హంతకులు ● గదగ్ హత్యకేసును ఛేదించిన పోలీసులు.. ఎనిమిది మంది అరెస్టు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 22: నలుగురు కుటుంబ సభ్యులను దారుణంగా హత్య చేసిన ఘటనలో పోలీసులు ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. ఈ నెల 19న గదగ్ పట్టణంలోని దాసర వీధిలో నగరసభ ఉపాధ్యక్షురాలు కుమారుడితో పాటు ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని నిద్రిస్తున్న స్థలంలోనే దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఉత్తర వలయ ఐజీపీ వికాస్ కుమార్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వివరాలు వెల్లడించారు. గదగ్ ఎస్పీ బీఎస్ నేమగౌడ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక తనిఖీ బృందం కేసును ఛేదించి 8 మందిని అరెస్టు చేసి విచారించినట్లు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐజీపీ వికాస్ కుమార్

రూ.65లక్షలకు సుపారీ



ఈ కేసులో ప్రకాష్ బాకళె మొదటి భార్య కుమారుడిపై వినాయక్ బాకళె ప్రధాన నిందితుడు, హత్యకు సుపారి ఇచ్చిన వ్యక్తిగా గుర్తించారు. మిగిలిన వారిలో గదగ్‌కు చెందిన ఫైరోజ్ ఖాజీ, జిశాన్ ఖాజీ, మీరజ్ సాహిల్ ఖాజీ, సోహెల్ ఖాజీతో పాటు మీరజ్‌కు చెందిన సుల్తాన్ శేఖ్, మహేష్ సోళంకి, వాహిద్ బేపారి ఏడుమందిని నిందితులుగా గుర్తించారు. తండ్రీకొడుకుల మధ్య ఉన్న తగాదాలే హత్యలకు ప్రధాన కారణంగా పోలీసులు గుర్తించారు. ప్రకాశ్ బాకళెకు మొదటి భార్య కుమారుడు వినాయక్ బాకళె పేరుమీదుగా చాలా ఆస్తులు చేశాడు. ఈ వ ు ద్య కాలంలో తండ్రికి తెలియకుండా వినాయక్ బాకళె ఆస్తులు అమ్మడంతో తండ్రీకొడుకుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. వినాయక్ ప్రవర్తనపై తండ్రి ప్రకాష్ బాకళె విసుగు చెందాడు. ఆస్తి అమ్మకాలకు కుటుంబ సభ్యులు అడ్డుపడుతున్నారనే నెపంతో ఎలాగైనా సరే తల్లితండ్రులు, సోదరుడిని అడ్డుతొలగించుకోవాలని వినాయక్ బాకళె హత్యకు పక్కా ప్లాన్ చేశాడు. గదగ్‌కు చెందిన కొంతమంది వ్యక్తులతో హత్యకు రూ.65లక్షలకు సుపారి కుదుర్చుకున్నారు. రూ.2లక్షలు అడ్వాన్స్‌గా కూడా అందజేశాడు. అయితే వినాయక్ బాకళె వేసిన స్కెచ్ తారుమారు కావడంతో తండ్రి ప్రకాష్, తల్లి సునందలకు బదులుగా వారి బంధువులు హత్యకు గురయ్యారు. పై అంతస్తులో గదగ్ నగరసభ ఉపాధ్యక్షురాలు సునందా బాకళె కుమారుడు కార్తిక్ బాకళె(27) బంధువులైన పరుషరామ(55), అతని భార్య లక్ష్మి(45), కుమార్తె అకాంక్ష(16)లు 19ను తెల్లవారు జామున హత్యకు గురయ్యారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. మృతుల్లో ముగ్గురు కొప్పళకు చెందిన వారు. నిశ్చితార్థ కార్యక్రమానికి కొప్పళ నుంచి పరుశురామ కుటుంబ సభ్యులు ప్రకాష్ బాకళె ఇంటికి వచ్చి హత్యకు గురికావడం స్థానికులను కలిచి వేస్తోంది. ఘటన జరిగిన 48గంటల్లోనే హత్యకు పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కేసును ఛేదించిన పోలీసు బృందానికి ఆయన అభినందనలు తెలపడంతో పాటు రూ.5లక్షల



హంతకుల చేతిలో బలయిన కుటుంబ సభ్యులు(ఫైల్)



ఏడు విడతల వెనుక ఏదో కుట్ర..!

● సుదీర్ఘకాలం పోలింగ్‌పై అనుమానాలున్నాయి ● ఎన్నికల ప్రక్రియ వేగంగా ముగియాల్సింది ● కేంద్రం, ఎన్నికల కమిషన్ స్పష్టత ఇవ్వాలి ● కేంద్ర మాజీ మంత్రి వీరప్పమొయిలీ

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగం అభివృద్ధి చెందిన కాలంలోనూ సుదీర్ఘకాలంపాటు లోక్‌సభ ఎన్నికలు జరపడం వెనుక కేంద్రప్రభుత్వ కుట్ర ఉందని కేంద్ర మాజీ మంత్రి వీరప్పమొయిలీ ఆరోపించారు. మంగళూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 3 నెలలపాటు లోక్‌సభ ఎన్నికలు కొనసాగించడంపై అనుమానం తలెత్తుతుందన్నారు. ఈ విషయంపై ప్రధానమంత్రి, కేంద్ర ఎన్నికల కమిషనర్ స్పష్టత ఇవ్వాలని కోరారు. గతంలో 20 రోజుల్లోనే ఎన్నికలు జరిపిన చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం సాంకేతికంగా ఎంతో ప్రగతి సాధ్యమైందన్నారు. ఇటువంటి సమయంలో మరింత వేగవంతంగా ఎన్నికల ప్రక్రియ ముగియాల్సి ఉండేదన్నారు. కానీ కేంద్రప్రభుత్వం కుట్రకు పాల్పడిన సందేహం వస్తోందన్నారు. ఒక దేశం ఒకే ఎన్నిక అనే బీజేపీ అజెండా వెనుక ఆలోచన అయి ఉంటుందన్నారు. ఎన్నికలు జాప్యంగా జరిగితే ప్రలోభాలకు అవకాశం పెరుగుతుందన్నారు. రాజ్యాంగ ఆశయాలకు భంగం కలగరాదన్నారు. సుదీర్ఘకాల ఎన్నికలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



రెండో ఈవీఎంను ఎప్పుడు వినియోగిస్తారంటే!

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఒక నియోజకవర్గంలో 16మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎంను ఉపయో గిస్తారు. ఒక ఈవీఎంలో 16మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలుంటుంది. అంతకన్న ఎక్కువమంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. ఉదాహరణకు 18మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదట ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరి వివరాలు ఉంచు తారు. ఈవీఎం మొరాయిస్తే అప్పటివరకు నమోదైన వివరాలు సీజ్ చేసి, రెండో ఈవీఎంను వినియోగిస్తారు.

కోలారులో.. కొత్తముఖాలు



● కాంగ్రెస్, జేడీఎస్ మధ్యే కీలక పోటీ



బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయం సరికొత్త అధ్యయనానికి కోలారు తెర లేపింది. కాంగ్రెస్ కంచుకోటగా ఉండే కోలారులో అంతర్గత కుమ్ములాటలు తారస్థాయికి చేరి అనూహ్యమైన వ్యక్తికి టిక్కెట్ వరించింది. ఇక బీజేపీ కూడా ఆచి తూచి వ్యవహరించి జేడీఎస్‌కు సీట్లు కట్టబెట్టింది. ఇలా కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్య పోరు సాగుతోంది. కాంగ్రెస్‌లో మాజీ స్పీకర్ రమేశ్ కుమార్, కేంద్ర మాజీ మంత్రి కేహెచ్ మునియప్ప వర్గాలు టిక్కెట్ సాధించే విషయంలో పోటీ పడ్డారు. ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీసీఎంతో పాటు అధిష్టానం నేతలు జోక్యం చేసుకున్నా సఖ్యత కుదరకపోవడంతో రెండు గ్రూపులను పక్కనబెట్టి కొత్త వ్యక్తికి టిక్కెట్ కేటాయించారు.



కేవీ గౌతమ్(కాంగ్రెస్)

కాంగ్రెస్ కంచుకోటలో గెలుపెవరిదో...

● కాంగ్రెస్ కంచుకోట కోలారు లోక్‌సభ నియోజకవర్గంలో 75 ఏళ్ల రాజకీయాన్ని పరిశీలిస్తే కేవలం రెండుసార్లు మాత్రమే ఇతర పార్టీలు గెలుపొందాయి. ఇక్కడ నిరంతరంగా కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందుతూ వచ్చారు. కేహెచ్ మునియప్ప ఏకంగా ఏడుసార్లు ఇక్కడనుంచి ఎంపీగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో మునియప్పను ఓడించేందుకు మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ వర్గీయులు చేసిన ప్రయత్నం ఫలించింది. ఈ పరిణామంగా ఓటమి చూడని మునియప్ప తొలిసారి పరాభవం పొందారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో రమేశ్‌కుమార్ ఓడిపోగా కేహెచ్ మునియప్ప శాసనసభకు వచ్చి మంత్రి అయ్యారు. ఇలా రాష్ట్రంలో ఎక్కడా లేని అంతర్గత పోరు కోలారు జిల్లాలో కొనసాగుతోంది. రాష్ట్రమంత్రి మునియప్ప అల్లుడు చిక్కపెద్దన్నను అభ్యర్థిని చేయాలని ప్రయత్నించారు. కానీ ప్రత్యర్థి రమేశ్‌కుమార్ వర్గీయులు అడ్డు తగిలారు. 35ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి కొత్త ముఖం బరిలో నిలిచినట్టయ్యింది.

● కోలారు నుంచి బయట వ్యక్తి పోటీ చేయడం ఇదేం కొత్త కాదు. బెంగళూరు పాలికె కార్పొరేటర్‌గా వ్యవహరించిన మునిస్వామి అనూహ్యంగా 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి గెలుపొందారు. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి అదే తరహాలోనే ఒకప్పుడు బెంగళూరు మేయర్‌గా వ్యవహరించిన అనుభవంతో విజయ్‌కుమార్ కొడుకు కేవీ గౌతమ్‌కు టిక్కెట్ కేటాయించారు.

● ఎన్డీయే అభ్యర్థి మల్లేశ్‌బాబు ప్రచారం వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ నేత యడియూరప్ప, జేడీఎస్‌నేత కుమారస్వామి పేర్లతో ఓట్లు అడుగుతున్నారు. కాంగ్రెస్‌కు చెందిన గౌతమ్, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ పేర్లతో ప్రచారం చేస్తున్నారు. ఇద్దరు అభ్యర్థులు సొంత సాధనలు, రాజకీయ అనుభవం లేకపోవడంతో అగ్రనేతల పేరిట ఓట్లు అడుగుతున్నారు. కాంగ్రెస్‌లో స్థానిక నేతలు మునియప్ప, రమేశ్‌కుమార్‌ల పేర్లు చెబితే ఎక్కడ బెడిసికొడుతుందోననే భయం వెంటాడుతోంది.

● గౌతమ్‌కు కలిసొచ్చే అంశాలు కాంగ్రెస్‌లోని ఏ గ్రూప్‌తోనూ సంబంధాలు లేకపోవడం, సీనియర్లతో సంబంధాలు కలిగి ఉండడం, పార్టీలో అనుభవం ఉండడం. ఇక మైనస్ అంశాలలో స్థానికేతరుడు కావడం, స్థానికంగా అంతర్గత కుమ్ములాటలు, మంత్రి మునియప్ప ప్రచారానికి హాజరు కాకపోవడం వంటివి ఉన్నాయి. జేడీఎస్ అభ్యర్థి మల్లేశ్‌బాబుకు మంచి వ్యక్తి అనే పేరు ఉండడం, రెండుసార్లు ఓడిపోయారనే సానుభూతి, బీజేపీ మద్దతు ఇవ్వడం కలసి వస్తున్నాయి. ఇక మైనస్‌లలో బీజేపీ, జేడీఎస్ నాయకులలో మనస్తాపాలు, లోక్‌సభ ఎన్నికలు పర్యవేక్షించిన నాయకత్వం లేకపోవడం, 8 శాసనసభ నియోజకవర్గాలతో పరిచయం లేకపోవడం.



మల్లేశ్ బాబు (జేడీఎస్)

● కోలారులో 17,26,914మంది ఓటర్లు కాగా 8,72,874మంది మహిళలు, 8,53,829 మంది పురుషులు, 211మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారు. కోలారు లోక్‌సభ పరిధిలో శిడ్లఘట్ట, శ్రీనివాసపుర నుంచి జేడీఎస్ ఎమ్మెల్యేలు ఉండగా, చింతామణి, ముళబాగిలు, కేజీఎఫ్, బంగారపేట, మాలూరు, కోలారులనుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కోలారులో ఎస్సీ, ఎస్టీల ఓట్లే నిర్ణయాత్మకమైనవి. ఎస్సీలు 3.8లక్షలు కాగా ఎస్టీలు 1.80 లక్షల మంది ఉన్నారు. ఆ తర్వాత మైనారిటీలు అత్యధికం. 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి 7,09,165 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి మునియప్ప 4,99,144 ఓట్లు సాధించగా 2,10,021 ఓట్ల మెజారిటీ సాధ్యమైంది.

నేడు రాష్ట్రానికి అగ్రనేతలు





● రాజధానికి అమిత్ షా

● చిత్రదుర్గకు ప్రియాంక గాంధీ..

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తొలి విడత పోలింగ్‌కు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో ప్రచారం హోరెత్తుతోంది. మంగళవారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బెంగళూరు పర్యటనకు వస్తున్నారు. ఆయన సాయంత్రం 7.30 గంటలకు హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. బెంగళూరు దక్షిణ నియోజకవర్గ పరిధిలో రోడ్ షో నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. స్వామి వివేకానంద సర్కిల్ నుంచి సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ దాకా సాగనుంది. 13 కిలోమీటర్ల మేర రోడ్‌షో కొనసాగనుంది.

చిత్రదుర్గలో ప్రియాంక ప్రచారం

కాంగ్రెస్ అగ్రనేత్రి ప్రియాంకగాంధీ ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు చిత్రదుర్గలో జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. సాయంత్రం 5.45 గంటలకు బెంగళూరులో ప్రచా ర సభల్లో ఆమె భాగస్వామ్యులవుతారు.

కాంగ్రెస్‌లో చేరిక

చింతామణి, ఏప్రిల్ 22: తాలూకాలోని మాడికెరె గ్రామంలో పార్టీకి దూరమైనవారంతా తిరిగి కాంగ్రెస్‌లోకి చేరారు. మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ సమక్షంలో సోమవారం అప్పోజిరెడ్డి, ఈరప్పరెడ్డి, రఘునాథరెడ్డి, పంచాయతీ సభ్యుడు అంజప్ప తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి మనలోని చిన్నా చితకా అభిప్రాయబేధాలను పక్కన పెట్టాలన్నారు. మాడికెరె గ్రామంలో పార్టీకి పూర్వవైభవం తేవాలన్నారు. ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజారిటీ తేవాలన్నారు. గత ఎన్నికల్లో తనకు 97వేల ఓట్లు వచ్చాయని ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో 1.15 లక్షల ఓట్లకుపైగా సాధ్యమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఊలవాడి గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు అశోకరెడ్డి, అశ్వథనారాయణబాబు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సుధాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గ్రామస్థులు

చిక్కబళ్లాపురలో పెద్ద సవాల్..



● ఇరు పార్టీల అభ్యర్థులు అగ్రగణ్యులే

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరానికి అనుబంధంగా ఉండే చిక్కబళ్లాపుర లోక్‌సభ ఎన్నిక పెద్ద సవాల్‌గా మారింది. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ సుధాకర్ తొలిసారి లోక్‌సభకు బీజేపీ-జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఎంఎస్ రామయ్య విద్యా వైద్య గ్రూప్ సంస్థల సభ్యుడు రక్షా రామయ్య తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో నిలిచారు.

చిక్కబళ్ళాపుర కాంగ్రెస్ కంచుకోట

1977లో చిక్కబళ్ళాపుర లోక్‌సభ నియోజకవర్గ ఏర్పడగా అప్పటి నుంచి 8సార్లు ఎన్నిక జరగ్గా ఐదుసార్లు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. 1977లో తొలిసారి లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడ్డాక కాంగ్రెస్ నుంచి ఎంవీ కృష్ణప్ప గెలుపొందారు. 1980లో ఎస్ఎన్ ప్రసన్నకుమార్, గెలుపు సాధించారు. ఆ తర్వాత వీ కృష్ణారావు కాంగ్రెస్ నుంచి 1984, 1989, 1991లలో గెలుపొందారు. 1996లో జనతాదళ్ నుంచి ఆర్ఎల్ జాలప్ప గెలుపొందారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి 1998, 1999, 2004లలో గెలుపు సాధించారు. 2009, 2014లలో వీరప్పమొయిలీ కాంగ్రెస్ నుంచి గెలుపు సాధించి కేంద్రంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో కీలకమైన మంత్రి పదవులలో కొనసాగారు. 2019లో బీఎన్ బచ్చేగౌడ బీజేపీ నుంచి విజయం సాధించారు.



సుధాకర్ (బీజేపీ)

● డాక్టర్ సుధాకర్ 2013లో కాంగ్రెస్ నుంచి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. 2018లో రెండోసారి ఎమ్మెల్యే అయ్యారు. 2019 సంక్షోభంలో రాజీనామా చేసి బీజేపీ నుంచి గెలుపొంది మూడున్నరేళ్ల పాటు వైద్య ఆరోగ్య, వైద్యవిద్యాశాఖల మంత్రిగా కొనసాగారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రదీప్ ఈశ్వర్ చేతిలో ఓటమి చెందారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా సుధాకర్ మంచి పథకాలు అమలుతో పాటు చిక్కబళ్ళాపురకు మెడికల్ కళాశాల సాధనలో పేరొందారు. అయితే కోవిడ్ వేళ అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రక్షా రామయ్య ఎంఎస్ రామయ్య గ్రూప్ సంస్థల ఉపాధ్యక్షుడు ఎంఆర్ సీతారాం వారసుడు. ఎంఆర్ సీతారాం గతంలో మంత్రిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన రక్షా రామయ్య ప్రస్తుతం జాతీయ కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు.



రక్షా రామయ్య (కాంగ్రెస్)

● డాక్టర్ సుధాకర్‌కు మూడుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగిన అనుభవం, బీజేపీ-జేడీఎస్‌ల మైత్రి, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హవా కలిసివస్తుండగా లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేయడం. 8 నియోజకవర్గాల్లో 2 చోట్ల మాత్రమే బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇతడిపై అసంతృప్తితోపాటు అంతర్గత పోరు మైనస్‌గా ఉన్నాయి. రక్షా రామయ్యకు యువ అభ్యర్థి, కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలు, 6 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడం కలసి వచ్చే అంశం. ఎన్నికల అనుభవం లేకపోవడం, స్థానికేతరుడు కావడం. పాలనా వ్యతిరేకత ఉండడం మైనస్‌గా ఉంది. చిక్కబళ్ళాపుర లోక్‌సభ పరిధిలో యలహంక, దొడ్డబళ్ళాపుర నుంచి బీజేపీ ఎమ్మెల్యేలు ఉండగా హొస్కోటె, దేవనహళ్ళి, నెలమంగల, చిక్కబళ్ళాపుర, బాగేపల్లి నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. గౌరిబిదనూరు నుంచి ఇండిపెండెంట్‌గా గెలుపొందిన పుట్టస్వామిగౌడ కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారు. నియోజకవర్గానికి శాశ్వతమైన నీటి వనరు లేకపోవడం ప్రధానమైన సమస్యగా కొనసాగుతోంది. నియోజకవర్గంలో 19,81,347మంది ఓటర్లు ఉండగా 9,97,306మంది మహిళలు, 9,83,775మంది పురుషులు, 266మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీకి చెందిన బచ్చేగౌడ 7,45,912 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి వీరప్పమొయిలీ 5,63,802 ఓట్లు పొందారు. ఏకంగా 1,82,110 ఓట్ల మెజారిటీ సాధించారు.

తెలుగు, కన్నడ సమ్మిళితం

మడకశిర నియోజకవర్గానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ప్రత్యేకత ఉంది. దీనికి కర్ణాటక సరిహద్దుగా ఉండడంతో తెలుగు, కన్నడ సమ్మిళతంగా ఉంటుంది. ఇక్కడి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయి. మడకలపల్లి మడకశిరగా మారినట్లు చరిత్ర చెబు తోంది. హేమావతిలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వర స్వామి, భక్తరహల్లిలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, జిల్లడ గుంటలో ఆంజనేయసామి ప్రసిద్ధి చెందిన ఆలయాలు ఉన్నాయి.

భిన్న సంస్కృతుల మడకశిర

ఏళ్ల తరబడి వెంటాడుతున్న సమస్యలు

తాగు,సాగు నీటి కోసం ఎదురుచూపులు

బండబారిపోతున్న వేలాది ఎకరాలు

మడకశిర, ఏప్రిల్ 22 : తెలుగు, కన్నడ సమ్మిళత ప్రాంతం మడకశిర. కన్నడ సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడ కన్నడ సంప్రదాయాలు ఎక్కువగా కనిపిస్తాయి. చరిత్ర ప్రకారం మడకలపల్లి నేడు మడకశిరగా మారింది. మడకశిరను మైసూరు శిర నాయకలు కట్టించారు. బీజాపూరు రాజుల దండయాత్ర వల్ల రాజ్యాన్ని కోల్పోయిన వీరికి ప్రత్యామ్నాయంగా రత్నగిరి మడకశిర ఇచ్చారు. 1520లో స్థానిక నాయకుడు రత్నగిరి సర్పప్ప రాజా అడవిని చదును చేసి ఇక్కడ గ్రామాన్ని, ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారని కథనం. మడకశిర నియోజకవర్గం 1952 లో ఏర్పడింది. నియోజకవర్గంలో 326 గ్రామాలు ఉన్నాయి. రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాలు ఉన్నాయి. అమరాపురం మండలం హేమావతిలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయం దక్షిణకాశిగా వెలుగొందుతోంది. మడకశిర మండలం భక్తరహళ్లిలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంటలో వెలసిన ఆంజనేయసామి ప్రసిద్ధి చెందిన ఆలయాలు ఉన్నాయి. ఈ ప్రాంత రైతులు పాడిపరిశ్రమ, వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మొదటి నుంచి ఈ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది.



హెంజేరు సిద్దేశ్వరస్వామి

ప్రధాన సమస్యలు

మడకశిర నియోజకవర్గంలో ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. సాగునీటి పథకం పనులు పూర్తి కాకపోవడంతో తాగు, సాగు నీటికి జనం అవస్థలు పడుతున్నారు. వర్షాభావం కారణంగా పంటలు దెబ్బతినడం, భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్లు అడుగంటిపోయి వేలాది ఎకరాలు బీడుగా మారి బండబారిపోతున్నాయి. తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరై పనులు 90 శాతం పూర్తయినా ఆ కాస్త పనులను కూడా ఈ ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వేసవిలో సాగు,తాగు నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. నియోజకవర్గంలో ఎటువంటి సాగు నీటి వనరులు లేక పోవండతో ఈ ప్రాంత రైతులు వర్షాధారిత, బోరు, బావులు కింద పంటల సాగుచేసి జీవనం సాగిస్తున్నారు. వర్షాలు సరిగా కురవక రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కొంత మంది రైతులు అప్పులు బాధ తాళలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. హంద్రీనీవా కాలువల ద్వారా నియోజక వర్గంలోని చెరువులన్నింటికి కృష్ణానది జలాలతో నింపి నీటి సమస్య పరిష్కరించాల్సి ఉంది. ఇప్పటి వరకు నియోజకరవ్గంలో 5 చెరువులకే నీటిని వదిలారు. మిగతా చెరువులకు కూడా వదలాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంటలకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు పక్క రాష్ట్రాల్లోని మార్కెట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో రవాణా ఖర్చులు అదనంగా పడడమే గాక ఇక్కడి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా పోతోంది. లక్షలాది రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డు నిరుపయోగంగా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు.

● 2017లో రొళ్ల మండలంలోని రత్నగిరిలో లక్ష్మీకోళ్లాపురమ్మ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. గుడిబండ మండలం రాళ్లపల్లి వద్ద మరో రిజర్వాయర్‌కు డీపీఆర్ తయారు చేయడానికి నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వం మారడంతో ఆ పనులు నిలిచిపోయాయి.

● అమరాపురం, గుడిబండ మండలాల్లో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు గానీ ఇంతవరకు నెరవేరలేదు.

● అగళి మండల కేంద్రంలో సామూహిక మరుగుదొడ్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

● గుడిబండ మండలం రాళ్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో పాలనా పరమైన అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుత వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. హంద్రీనీవా కాలువల పనులు, కల్వర్టుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. గుడిబండ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల భవనాలు గత తెలుగుదేశం హయాంలో రూ.23 కోట్లు మంజూరు చేశారు. సగభాగం నిర్మించి వదిలేశారు.

● అమరాపురం మండలంలో వక్కసాగు ఎక్కువగా ఉండడంతో మార్కెట్ ఏర్పాటు చేస్తామని నాయకులు హామీలు ఇస్తున్నారేగానీ ఇంతవరకు పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వంలో వక్క మార్కెట్ కోసం స్థలం కేటాయించి రూ.3.50 కోట్లు మంజూరు చేశారు. వైసీపీ ప్రభుత్వం రావడంతో దానిని విస్మరించారు.

● అమరాపురం నుంచి విరుపసముద్ర కర్ణాటక సరిహద్దు వరకు 8కిలో మీటర్ల రోడ్డు తొలగించి కంకర వేశారు. రోడ్డు నిర్మించక పోవడంతో అటు వెళ్లేందుకు జనం ఇబ్బందులు పడుతున్నారు.

● మడకశిర పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపి 10 సంవత్సరాలు దాటిపోయింది.

● ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తెలుగుదేశం పార్టీ హయాంలో రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు చేపట్టారు. 2019 నాటికి 80 శాతం పనులు పూర్తయినా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మిగిలిన పనులు నిలిచిపోయాయి.

● మడకశిర పట్టణంలో 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చి నాలుగేళ్లు దాటుతున్నా నేటికీ భవననిర్మాణాలు పూర్తి కాలేదు. దీంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

● పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్లో రూ. 5కోట్లతో సంత మార్కెట్ ఏర్పాటు చేయడానికి స్థలం చదును చేశారు. ఇప్పటి వరకు మార్కెట్ ఏర్పాటు చేయలేదు.

● మడకశిర పట్టణంలో రూ.48 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టి 75 శాతం పనులు పూర్తి చేసినా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	సిద్దనగౌడ్	ఇండిపెండెంట్	వెంకటశివమ్మ	కాంగ్రెస్	14,844
1962	బి.రుక్మిణీదేవి	కాంగ్రెస్	ఎన్.స్వామి	ఇండిపెండెంట్	9,006
1967	ఎంబీ రాజారావు	ఇండిపెండెంట్	బి.రుక్మిణీదేవి	కాంగ్రెస్	13,847
1972	ఎం.ఎల్లప్ప	కాంగ్రెస్	బి.రుక్మిణీదేవి	ఇండిపెండెంట్	13,125
1978	వై.తిమ్మారెడ్డి	కాంగ్రెస్	ఎన్.శ్రీరామరెడ్డి	జనతా	11,451
1983	వైసీ తిమ్మారెడి	కాంగ్రెస్	హెచ్‌బీ నర్సేగౌడ్	ఇండిపెండెంట్	5,604
1985	హెచ్‌బీ నర్సేగౌడ్	టీడీపీ	వైటీ ప్రభాకరరెడ్డి	కాంగ్రెస్	24,720
1989	ఎన్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	హెచ్‌బీ నర్సేగౌడ్	టీడీపీ	10,728
1994	వైటీ ప్రభాకరరెడ్డి	టీడీపీ	ఎన్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	6,339
1999	ఎన్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	ఈరేగౌడ్	టీడీపీ	27,556
2004	ఎన్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	వైటీ ప్రభాకరరెడ్డి	టీడీపీ	15,336
2009	కె.సుధాకర్	కాంగ్రెస్	కె. ఈరన్న	టీడీపీ	10,445
2014	కె.ఈరన్న	టీడీపీ	ఎం.తిప్పేస్వామి	వైసీపీ	14712
2018	ఎం.తిప్పేస్వామి	వైసీపీ	కోర్టు ద్వారా ఎన్నిక		
2019	ఎం.తిప్పేస్వామి	వైసీపీ	కె.ఈరన్న	టీడీపీ	13,136

మడకశిర నియోజకవర్గంలో ఓటర్లు


మండలం	పురుషులు	మహిళలు	థర్డ్ జండర్	మొత్తం
అమరాపురం	23,530	23,389	-	46,919
గుడిబండ	21,809	21,351	-	43,160
రొళ్ల	15,660	15,017	-	30,677
అగలి	13,463	13,219	-	26,682
మడకశిర రూరల్	23,357	23,074	1	46,432
మడకశిర అర్బన్	8,423	8,781	-	17,204
మొత్తం	1,06,242	1,04,831	1	2,11,074

తొలి ఎమ్మెల్యే సిద్దనగౌడ్

మడకశిర తొలి ఎమ్మెల్యే సిద్దనగౌడ్. ఈయన మడకశిర పట్టణానికి చెందిన సిద్దరామేగౌడ, దేవీరమ్మల కుమారుడు. 1894 జూన్ 15న జన్మించారు. 1975 ఆగస్టు ఆయన మృతిచెందారు. తొలిసారిగా సిద్దనగౌడ 1952లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందారు. 1952లో సిద్దనగౌడ్‌పై కాంగ్రెస్ నుంచి మడకశిర మండలం వైబీ హళ్లి గ్రామానికి చెందిన వైసీ తిమ్మారెడ్డి సతీమణి వెంకటశివమ్మ పోటిచేసి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో సిద్దనగౌడకు 23,214 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి వెంకటశివమ్మకు 8,370 ఓట్లు వచ్చాయి. 14,844 ఓట్ల మెజార్టీతో సిద్దనగౌడ్ విజయం సాధించారు.

రాజకీయ చరిత్ర

మడకశిర నియోజకవర్గం 35,724 చదరపు కిలోమీటరు విస్తీర్ణంలో ఉంది. 1952లో మడకశిర నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలు మడకశిర, రొళ్ల, గుడిబండ, అగళి, అమరాపురం ఉన్నాయి. నియోజకవర్గంలో 2,57,820 జనాభా ఉంది. 2,11,074 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,06,242 మంది, మహిళలు 1,04,831 మంది ఉన్నారు. ఇప్పటి వరకు 14సార్లు ఎన్నికలు జరిగాయి. 1983లో వై.తిమ్మారెడ్డి సమీప స్వతంత్ర అభ్యర్థిపై 5,604 ఓట్లతో (అత్యల్ప) మెజార్టీతోను విజయం సాధించారు. 1999లో రఘువీరారెడ్డి సమీప టీడీపీ అభ్యర్థిపై 27,566 అత్యధిక ఓట్లతో విజయం సాధించారు. మడకశిర నియోజకవర్గంలో ఇప్పటి వరకు 14సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది సార్లు, టీడీపీ మూడు సార్లు, వైసీపీ ఒకసారి, స్వతంత్ర పార్టీ అభ్యర్థి ఒకసారి, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ఈరేగౌడ్‌పై 27,566 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుత సీడబ్ల్యూసీ మెంబరు రఘువీరారెడ్డి మడకశిర నియోజకవర్గం నుంచి మూడుసార్లు విజయం సాధించారు.





భక్తరహళ్లి నరసింహస్వామి దేవాలయం



నరసింహస్వామి మూలవిరాట్



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

హనుమజ్జయంతి



చైత్రశుద్ధ పౌర్ణమిన హనుమ జన్మోత్సవంగా ఆచరిస్తారు. ఈ రోజు హనుమాన్ భక్తులు రోజం తా ఉపవాసం ఉండి హను మాన్ చాలీసా పఠనం, రామ నామం జపం చేస్తారు. శివ మహాపురాణం, రామాయ ణం మొదలైన గ్రంథాలలో హనుమంతుడి జన్మ వృత్తాం తం వివరించబడింది. పురాణాల ప్రకారం పుంజికస్థల అనే అప్సరస అంజన అనే వానరకాంతగా జన్మించింది. కేసరి అనే వానరవీరుడు ఆమెను పెళ్లాడెను. సం తా నం కోసం శివుడిని ఆరాధించారు. వాయుదేవుడు శివుడి తేజమును పండు రూపంలో అంజనకు ఇచ్చారు. అంజ నకు జన్మించిన సుతుడే ఆంజనేయుడు, కేసరి నందను డని, వాయుదేవుని అనుగ్రహంతో జన్మిం చినందున వాయుసుతుడనీ కూడా పిలుస్తారు. శ్రీరామ నవమితో పాటు కొందరు హనుమజ్జయంతిని ఆచరిస్తారు.

శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి (జయంతి)



సుబ్రమణ్యశాస్త్రి 1891 ఏప్రిల్ 23న తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం సమీపంలోని పొలమూరులో జన్మించారు. క థా రచయితగా పేరొందారు. తె లుగు సాహిత్యంలో నవల, నా టకం, కథ, కవిత, చరిత్ర, పు రాణ ఇతిహాసాలు, శాస్త్రాలు ఇ లా ఎన్ని ప్రక్రియలు చేపట్టినా అందరిచే శెహబాష్ అ నిపించుకున్నారు. ఆయన దృష్టిలో రచన అనేది ఒక త పస్సు. అవ ధానా లు కూడా చేశారు. ప్రబుద్ధాంధ్ర అ నే పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించారు. సంగీతంలోనూ, ఆయుర్వేద వైద్యంలోనూ రాణించారు. 1961 ఫిబ్రవరి 25న కన్నుమూశారు.

అన్నపూర్ణాదేవి (జయంతి)



ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు, పద్మభూషణ్ గ్రహీత అన్నపూర్ణాదేవి 1927 ఏప్రిల్ 23న ప్రస్తుత మధ్య ప్రదేశ్ రాష్ట్రం మైహార్‌లో జన్మిం చారు. మైహర్ ఘరానా స్థాప కులైన అల్లావుద్దీన్‌ఖాన్ కుమా ర్తె. ఆమె అసలుపేరు రోషనారా ఖాన్. మైహార్ మహా రాజు బ్రిజ్‌నాథ్‌సింగ్ ఆమె పేరును అన్నపూర్ణా దేవిగా మార్చారు. సితార్ విద్వాంసుడు పండిట్ రవిశంకర్‌ను వివాహం చేసుకుంది. ఎన్నో కచేరీలు చేసింది. కుమా రుడు సుబేంద్ర శంకర్ కూడా సంగీత విద్వాంసుడే. ఆశిష్‌ఖాన్ (సరోద్), అమిత్ భట్టాచార్య (సరోద్), బహదూర్ ఖాన్ (సరోద్), హరిప్రసాద్ చౌరాసియా (బన్సూరి) వంటి వారు ఆమె శిష్యులే కావడం విశేషం. సంగీత నాటక అకాడమీ పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు. 2018 అక్టోబరు 13న కన్నుమూశారు.

ఎస్. జానకి (పుట్టినరోజు)



ప్రముఖ నేపథ్యగాయని శిష్ట శ్రీరామమూర్తి జానకి 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా జన్మించారు. తన 50ఏళ్ల సినీ జీవితంలో వివి ధ భాషలలో దాదాపు 50 వేలకుపైగా పాటలు పాడారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో ఎక్కువగా పాటలు పాడారు. ఉత్తమ గాయనిగా జాతీ య పురస్కారం 4సార్లు, 31 సార్లు వివిధ రాష్ట్రాల ఉత్తమ గాయని పురస్కారం పొందారు. ప్రత్యేకించి ఇళయరాజా సంగీత దర్శకత్వంలో పాడిన పాటలు, ఎస్పీ బాలసుబ్రమణ్యంతో కలసి పాడిన పాటలు ఎంతో పేరొందాయి. 1957లో విధియిన్ విల యాట్టు అనే తమిళ సినిమాతో కెరీర్‌ను ప్రారంభించిన ఆమె 2016లో పాడడం ఆపేస్తున్నట్టు ప్రకటించారు. కలై మామణి, రాజ్యోత్సవ పురస్కారం, పద్మభూషణ్ ఇతర అవార్డులు అందుకున్నారు.

బీజేపీలో అసంతృప్తి

- బెళగావిలో ప్రచారానికి దూరంగా సీనియర్లు



బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బెళగావి బీజేపీలో అసంతృప్తి రగిలింది. పార్టీ సీనియర్ నేతలు ప్రచారానికి దూరమయ్యారు. దీంతో అభ్యర్థులలో వణుకు పట్టుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం అనిపించే బెళగావి జిల్లాలో పార్టీ సీనియర్‌లు అసంతృ ప్తితో ఉండడం రాష్ట్ర పార్టీ గుర్తించింది. ఈ మేరకు అధిష్ఠానానికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. చిక్కోడి నియోజకవర్గంలో ప్రచారానికి మాజీ ఎంపీ రమేశ్‌కత్తి, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రభాకర్ కోరె, మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళిలు దూరంగా ఉన్నారు. రమేశ్‌కత్తి చిక్కోడి నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే బీజేపీ అధిష్ఠానం అన్నాసాహెబ్ జొల్లెకు టిక్కెట్ ఇచ్చింది. దీంతో కత్తి దూరంగా ఉంటూ వస్తున్నారు. ప్రభాకర్ కోరె కుమారుడు అమిత్‌కు టిక్కెట్ దక్కకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు. వీరి ద్దరూ ప్రచారానికి దూరంగా ఉంటూ వస్తున్నారు. మాజీ మంత్రి, గోకాక్ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహొళి తమ్ముడు రాష్ట్ర మంత్రి సతీశ్‌జార్కిహొళి కుమార్తె ప్రియాంక జార్కిహొళి పోటీ చేస్తున్నారు. అంతకంటే రమేశ్ జార్కిహొళి ప్రత్యర్థిగా భావిస్తున్న లక్ష్మీ హెబ్బా ళ్కర్ కుమారుడు మృణాల్‌ను ఓడించాలని బెళగావి ప్రాంతంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ముగ్గురు కీలక నేతలు చిక్కోడి ప్రాంతంలో ప్రచారానికి దూరంగా ఉండడం సర్వత్రా చర్చనీయాంశం అవు తోంది. బీజేపీ ప్రధాన కార్యదర్శి మహేశ్ తెంగినకాయి ముగ్గురితోనూ సంప్రదింపులు జరిపారు. అయితే వారు వ్యక్తిగత కారణాలతో దూరంగా ఉంటున్నట్టు చెప్పినట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని పార్టీ అగ్రనేత లకు సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది.

దేశంలో పేదరికం తగ్గింది

- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేదరికం తగ్గిందని 25 కోట్ల మంది బీపీఎల్‌ను అధిగమించారని ఇది కేవలం పదేళ్లలో సాధ్యమైందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. చార్టెర్డ్ అకౌంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమ వారం సాయంత్రం చర్చాగోష్ఠి జరిగింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సదరన్ రీజనల్ ఛైర్మన్ గీతాతోపాటు బెంగళూరుశాఖ ఛైర్మన్ ప్రమోద్ హెగ్డే పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ 2047 నాటికి దేశ ఆర్థికత లక్ష్యంగా సీఏలు పనిచేయాలన్నారు. దేశంలో పేదరికం తగ్గుతోందంటే సంక్షేమాలు అమలవుతున్నాయని, ప్రతి కుటుంబం స్వశక్తితో జీవనం సాగించేలా ఎదుగుతోందన్నారు. ఉద్యోగం, ఆరోగ్యం, రవాణా, తాగునీరు, వసతి వంటి సౌలభ్యాలు పెరగడం ద్వారానే పేద రికం తగ్గుతోందన్నారు. ప్రధానమంత్రి స్వనిధి కోట్లాదిమందికి సొంతంగా వ్యాపారం చేసు కునేలా శక్తిని పెంపొందించిందన్నారు. జీఎస్టీ, ఐటీ మరింత సరళీకృతం చేశామన్నారు. కార్య దర్శి కవితా పరమేశ్, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ కోతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చర్చాగోష్ఠిలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు

మొక్కల పెంపకంతోనే పర్యావరణం



రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయాధికారి తదితరులు

చింతామణి, ఏప్రిల్ 22: ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలని మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సివిల్ న్యాయాధికారి పీఎం ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమ వారం తాలూకా న్యాయసేవల సమితి, న్యాయవాదుల సంఘం, పోలీసుశాఖ సంయుక్తంగా పట్టణంలోని 31వ వార్డు తిమ్మసంద్ర వద్ద చింతామణి రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. తాలూకా న్యాయసేవల సమితి అధ్యక్షుడు, సివిల్ న్యాయాధికారి పీఎం ప్రకాశ్, అదనపు సివిల్ న్యాయాధికారి రూపా, ప్రాంతీయ అటవీశాఖ అధికారి చందన్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జీ శివానంద, కార్యదర్శి శ్రీనాథ్, సంయుక్త కార్యదర్శి కేఎన్ మంజునాథ్, కోశాధికారి చౌడప్ప తదితరులు పాల్గొన్నారు. చింతామణి రూరల్ స్టేషన్ ఎస్సై మమతా అధ్యక్షత వహించి మాట్లాడుతూ భావితరాలకు మనం ఉంటున్న భూమిని కనీసంగానైనా అందించాలంటే పచ్చదనం పెం చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాలుష్య నియంత్రణకు పచ్చదనం దోహద పడుతుందన్నారు. మన జీవనానికి అవసరమైన గాలి, నీరు, ఆహారం ఇలా అన్నింటినీ భూమి ద్వారానే సమకూరుతున్నాయని అందుకు మనం భూమిని కాపాడుకోవాలన్నారు. అభివృద్ధి పేరిట పర్యావరణాన్ని దెబ్బతీసేలా నిర్మాణాలు ఉండరాదన్నారు. లేనిపక్షంలో ప్రకృతి వైపరీత్యాలు తప్పవన్నారు. వరల్డ్ ఎర్త్ డే ఆవశ్యకతను తెలిపేలా కార్యక్రమం నిర్వ హించడం సంతోషంగా ఉందన్నారు.

కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు లేవు

- ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, ఏప్రిల్ 22: కాంగ్రెస్ కంచుకోటగా బంగారపేట పురసభ ఉందని, 25ఏళ్లుగా కాంగ్రెస్ వశంలోనే ఉందని, పార్టీలో ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి వెల్లడించారు. పట్టణంలోని శాంతినగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆల యంలో సోమవారం విశేషపూజల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో పార్టీలో కొంత అభిప్రాయబేధాలు ఉండేవని ప్రస్తుతం అవన్నీ సద్దుమణి గాయ న్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం ఖాయమన్న ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ వార్డు, బ్లాక్ అధ్యక్షులు సహా అందరూ పట్టణంలో అభివృద్ధికోసం ఎంతో సహకరించారని ఈ నేపథ్యంలో పురసభ 25ఏళ్లుగా కాంగ్రెస్ కంచుకోటగా ఉందన్నారు. ప్రస్తుతం సిద్ధరామయ్య ప్రభుత్వం కొనసాగుతోందని ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అమలవు తున్నాయని, నగరాభివృద్ధికోసం రూ.35కోట్లు గ్రాంటు సాధించానన్నారు. బంగారపేట పట్టణంలోని శిరహం కాంపౌండ్, కెరెకోడి, అమరావతి తదితర వార్డుల అభివృద్ధికి రూ.17 కోట్లు మంజూరయ్యాయన్నారు. పట్టణంలో బస్టాండ్, క్రీడామైదానం, రంగమందిరం, హాస్టళ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్టు పేర్కొన్నారు. యరగోళ ప్రాజెక్టు ద్వారా 70శాతం మేర తాగునీరు సరఫరా అవుతోందని, మిగిలిన 30శాతం కూడా త్వరలోనే అందుబాటులోకి తెస్తా మన్నారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పార్థసారథి, పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చందుకుమార్, పురసభ సభ్యుడు వెంకటేశ్, షఫి, పోని, సాదిక్, శారదా, యువ నాయకుడు జీవన్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

దేవెగౌడ సేవలు అపారం



సమావేశంలో ఎస్సీ, ఎస్టీ విభాగం ప్రముఖులు తదితరులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 22: రాష్ట్రం కోసం శాశ్వతనీటి వనరులకోసం మాజీ ప్రధాని దేవేగౌడ చేసి న సేవలు అపారమని జేడీఎస్ నాయకుడు, జడ్పీ మాజీ సభ్యుడు బంక్ మునియప్ప పేర్కొ న్నారు. సోమవారం ఎస్సీ, ఎస్టీ విభాగం పట్టణంలోని చిక్కబళ్ళాపుర రోడ్డులోని అంజ నాద్రి సముదాయ భవన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ గత 60ఏళ్లలో చేసింది ఏమీ లేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మేలూరు రవికుమార్ కేవలం పది నెలల్లో పట్ట ణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కల్పించేందుకు రూ.80కోట్లు గ్రాంటు సాధించారన్నారు. హై టెక్ పట్టుగూళ్ల మార్కెట్‌కు చర్యలు చేపట్టారన్నారు. రాష్ట్రంలో జేడీఎస్ ప్రభుత్వం లేనప్పటికీ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా చొరవ చూపి గ్రాంట్లు తెచ్చారన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మరింత ప్రగతి సాధించాలంటే బీజేపీ - జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి మల్లేశ్ బాబుకు మద్దతు ఇవ్వాలని కోరారు. తద్వారా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడాలని ఆకాం క్షించారు. డీఎస్ఎస్ నాయకుడు మేలూరు మంజునాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌వారు దళితుల అభివృద్ధికి మొదలునుంచి సరైన సహకారం ఇవ్వలేదన్నారు. కేవలం హామీలు తప్ప అమలు చేసింది లేదన్నారు. సమావేశంలో గంజిగుంటె నరసింహమూర్తి, పురసభ మాజీ ఉపాధ్య క్షుడు చిక్కమునియప్ప, ముగుడెల్ నంజప్ప, అరుణ్, బంక్ మంజునాథ్ రమేశ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ కోసం ఓటు వేయండి

బంగారపేట, ఏప్రిల్ 22: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కర్ణాటక రిపబ్లిక్ సేన రాష్ట్ర అధ్యక్షుడు చిక్కనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం మూల నివాసి అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, దళిత నేత మునిమారప్పతో కలసి మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. దేశంలో దళి తులపై దాడులు, అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. సమగ్ర నాయకత్వం కొరవడిం దన్నారు. దళితులు, మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను కొందరు రాజకీయ నాయ కులు, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపేతర ప్రభుత్వం రాజ్యాంగ మార్పుకు యత్నిస్తోందన్నారు. రాజ్యాంగ రక్షణకోసం పాటుపడుతున్న కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో విద్యావంతుడైన కాంగ్రెస్ అభ్యర్థి కేవీ గౌతమ్‌కు తమ మద్దతు ఉంటుందన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్య హక్కును కాపాడుకోవాలన్నారు. మీడియా సమావేశంలో చింటు ఆర్ రామచంద్ర, నవీన్, అమరేశ్, శ్రీనివాస్, నటరాజ్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో కర్ణాటక రిపబ్లికొసేన రాష్ట్ర అధ్యక్షుడు చిక్కనారాయణ తదితరులు

ద్యావప్ప తాతయ్య పరుషలో ప్రముఖులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 22: తాలూకాలోని ప్రముఖయాత్రాస్థలమైన ద్యావప్పన గుడి ఉత్సవాల్లో భాగంగా ద్యావప్ప తాతయ్య పరుష సంబరంగా సాగింది. విశేషపూజల్లో కాంగ్రెస్ నాయ కుడు, ఎస్ఎన్ క్రియా ట్రస్టు అధ్యక్షుడు పుట్టు ఆంజినప్ప తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం ఆంజినప్ప మాట్లాడుతూ ఏటా యోగి ద్యావప్ప తాతయ్య జాతర వైభవంగా ఇక్కడ నిర్వహించడం ఆచారంగా వస్తోందన్నారు. ఇక్కడి ప్రత్యేకత ఏమిటంటే పశువులకు ఆరోగ్య సమస్యలు వస్తే తాతయ్య గుడికి వచ్చి ఉప్పును సమర్పించడం ద్వారా అనారోగ్యం పరిష్కారమయ్యే నమ్మకం నేటికీ కొనసాగుతోందన్నారు. తాను కూడా ఏటా ఉత్సవాల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజినప్పను ఆలయ అర్చకుడు దేవరాజ్ సత్కారం చేశారు.



విశేషపూజల్లో పాల్గొన్న ఆంజినప్ప

ఊరంతా వనాలకు..

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలంలోని చిగిచెర్ల గ్రామం మొత్తం సోమవారం ఖాళీ అయింది. ఒక్కరూ లేరు. ఊరి జనం.. పిల్లాపాపలతో వంట సామగ్రి, సరుకులతో ఉదయాన్నే వనభోజనాలకు వెళ్లారు. వనాల్లో వంటలు వండుకుని, అక్కడే భోజనాలు చేశారు. పిల్లాపాపలతో హాయిగా ఆటలు ఆడుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ గడిపారు. ఏటా శ్రీరామనవమి తర్వాత వనభోజనాలకు వెళ్లడం గ్రామంలో ఆనవా యితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే అందరూ గ్రామాన్ని వదిలి, శ్రీరా ముని చిత్రపటం ఊరేగింపుగా పిండివంటల సరుకులను గంపలో ఎత్తుకుని వనంలోకి వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి పిండి వంటలు చేసుకుని, కుటుంబస భ్యులతో కలిసి ఆరగించారు. వనంలో యువతులు, మహి ళలు ఊయలలు ఊగుతూ సంబరంగా గడిపారు. యువ కులు కేరింతలతో ఉత్సాహంగా గ్రామీణ క్రీడలతో అలరింపజే శారు. సాయంత్రం శ్రీరాముని పటంతో ఊరేగింపుగా గ్రామం లోకి చేరుకున్నారు.

-ధర్మవరంరూరల్



వనంలో పిండివంటలు చేస్తున్న మహిళలు



శ్రీరాముని చిత్రపటంతో ఊరేగింపు

నేడు చారిత్రాత్మక బెంగళూరు కరగ ఉత్సవం



విశేష పూజల్లో కరగధారి జ్ఞానేంద్ర

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బెంగ ళూరులో జరిగే చారిత్రాత్మక కరగ ఉత్సవానికి ఏర్పాట్లు జోరుగా సాగాయి. కరగ ఉత్సవాలలో భాగంగా సోమ వారం తెల్లవారుజామున హసి కరగ సంబరం జరిగింది. కరగను మోసే జ్ఞానేంద్ర ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. సంప్రదాయంగా ఖడ్గంతో ముందుకు సాగా రు. ఆయన వెంట వీర కుమారులు గోవింద నామ స్మరణతో పాల్గొన్నారు. చైత్ర పౌర్ణమి మంగళవారం రాత్రి ధర్మరాయస్వామి ఆలయం నుంచి కరగ ఊరే గింపు జరగనుంది. అర్ధరాత్రి 12 గంటలకు ఆరం భమయ్యే వేడుకలు తెల్లవారుదాకా కొనసాగనున్నాయి. ధర్మరాయస్వామి ఆలయం నుంచి నగరత్‌పేట, మార్కె ట్ తోపాటు వివిధ ప్రాంతాల్లో కరగ ఉత్సవం కొన సాగనుంది. ఉత్సవంలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. బెంగళూరులో జరిగే ప్రధాన కరగ ఉత్సవానికి దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పాల్గొంటారు.

నేడు ఆలంబగిరిపై శ్రీవారి బ్రహ్మరథోత్సవం



లక్ష్మీవెంకటరమణస్వామి ఉత్సవమూర్తులు

చింతామణి రూరల్, ఏప్రిల్ 22: తాలూకాలోని పురాణ ప్రసిద్ధ యాత్రాస్థలమైన కైవార సమీపంలోని ఆలంబగిరిలో కొలువైన లక్ష్మీవెంకటరమణస్వామి బ్రహ్మ రథోత్సవం మంగళవారం జరగనుంది. చైత్రశుద్ధ పూర్ణిమ నేపథ్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. ఉదయం 11.30 గంటలకు కైవార యోగి నారేయణమఠంలో స్వామి వారికి శ్రీకృష్ణ గంధోత్సవ సేవ, అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ఆలంబగిరిపై రథోత్సవం ఉంటుందని కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం వెల్లడించారు. శ్రీరామ నవమిన ప్రారంభమైన ఉత్సవాలు 11రోజుల పా టు కొనసాగనున్నాయన్నారు. ప్రతిరోజూ పలు ధార్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత అమరనారేయణ స్వామి, తాత య్య ఉత్సవానికి విశేష అభిషేకాలు, పూజలు, అష్టా వధాన సేవ, మహామంగళారతి ఉంటాయన్నారు. నాద సుధారస వేదికపై సంకీర్తనా సేవ ఉంటుందన్నారు.

యాదగిరిలో యువకుడి హత్య




రాకేశ్ (ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక పరిధిలోని జిల్లా కేంద్రమైన యాద గిరిలో ఒక హిందూ యువకుడు హత్యకు గురయ్యాడనే ఆరోపణలు వినిపించాయి. యాదగిరి నగరం శెహపురపేట్ లే అవుట్‌లో ఆది వారం ఘటన చోటు చేసుకుంది. దళిత సామాజికవర్గానికి చెందిన రాకేశ్ (22) హత్యకు గురైనట్టు నిర్ధారించారు. ఇతడిని ఫయాజ్ అతడి సహచరులే హతమార్చారనే ఆరోపణలు వినిపించాయి. హిందూ యువకుడి హత్య విషయాన్ని దాచేందుకు పోలీసుశాఖ యత్నించిందని బీజేపీ కార్య కర్తలు ఆరోపించారు. ఆదివారం రాత్రి హత్యకు గురైనా పోలీసులు కేసు నమోదు చేయలేదని మండిపడ్డారు. యువకుడి కుటుంబానికి అండగా ఉంటామని ప్రక టించారు. సోమవారం యువకుడి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు. యాదగిరి జిల్లా ఎస్పీ సంగీతా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నటి హర్షికా పూణచ్చపై దౌర్జన్యం

వివాదంలో ఇద్దరిపై కేసు

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కన్నడ నటి హర్షికా పూణచ్చ, భర్త భువన్ పొన్నణ్ణలపై దౌర్జన్యానికి పాల్పడిన వివాదంలో ఇద్దరిపై పోలీసులు సోమవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పులకేశినగర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. ఐపీఎస్ 143తోపాటు మరో ఐదు సెక్షన్‌లకింద కేసు నమోదైంది. హోటల్‌లో భోజనం ముగించుకుని బయటకు వచ్చిన వేళ పార్కింగ్ నుంచి కారు తీసే సమయంలో గొడవ చోటు చేసుకుంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.57	1,576.53
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	177	256
సామర్థ్యం (టీఎంసీలు)	3.82	3.01

ఉపాధి హామీ కార్మికులకు ఓటింగ్‌పై అవగాహన



ఓటింగ్ అవగాహన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 22: మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం క్రింద పనిచేస్తున్న కార్మికులకు సోమవారం ఆరోగ్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఓటుపై అవగాహన కల్పించారు. తాలూకాలోని బెళగల్లు తండాలో జరిగిన ఈ ఉచిత ఆరోగ్య శిబిరంలో బళ్లారి తాలూకా స్వీప్ నోడల్ అధికారి మాదగిన బసప్ప మాట్లాడుతూ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బళ్లారి నియోజకవర్గంలో మే 7న జరిగే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఎన్నికల పండుగను జయప్రదం చేయాలని కోరారు. ఓటింగ్ అవగాహన ప్రచారంలో భాగంగా ఓటు వేస్తామని ఓటర్ల చేత ఎన్నికల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంప్లాయిమెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ బసవరాజు, గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా జంబునాథేశ్వర రథోత్సవం



భక్తుల మధ్య జంబునాథేశ్వర రథోత్సవం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 22: హొసపేట నగరంలోని కొండపై కొలువై ఉన్న శ్రీ జంబునాథేశ్వర స్వామి మహా రథోత్సవం ఆదివారం సాయంత్రం అంగరంగా వైభవంగా జరిగింది. ఈకార్యక్రమంలో యువజన నాయకుడు సిద్దార్థసింగ్, కేఎంఎఫ్ అధ్యక్షుడు భీమానాయక్, హొసపేట, జంబునాథల్లి, అమరావతి, సంక్లాపూర్,కాకుబాలు, కల్లహళ్ళిరాజాపుర, వెంకటగిరి,రాణిబెన్నూర్, బూదిహాల్, శ్యామనూరు తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవంలో అపశ్రుతి

కాగా జంబునాథేశ్వర స్వామి రథచక్రం కింద పడి ఓ వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. అతన్ని హొసపేటలోని పార్వతి నగర్‌కుచెందిన రాము(45) గా గుర్తించారు. అరటిపండు తొక్కపై కాలు వేయడంతో జారి చక్రాల మధ్య ఇరుక్కుపోవడంతో అక్కడిక్కడికే మృతిచెందాడు. నగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప మృతుని ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కుంభోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రకాష్ మాళి

కంప్లి, ఏప్రిల్ 22 : కంప్లి పరిధిలోని రామసాగరం గ్రామంలో మంగళ, బుధవారాల్లో జరిగే కుంభోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ ప్రకాష్ మాళి తెలిపారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో వుంచుకుని ఎలాంటి రాజకీయ సమావేశాలు గానీ, రాజకీయ వ్యక్తులతో చర్చలు జరుపకుండా ఈ ఉడుసులమ్మ దేవి కుంభోత్సవాన్ని నిర్వహించుకోవాలన్నారు.కుంభోత్సవంలో ఎలాంటి సంఘటనలు జరిగినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శివశంకర్‌గౌడ, నారాయణప్ప, జగదీష్ గౌడ, రామయ్య, గ్రామస్తులు, సంఘ సంస్థ నేతలు, గ్రామ పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

● స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ ● ఎన్నికల బరిలో మిగిలిన 10మంది

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 22: బళ్లారి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ సోమవారంతో ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. జిల్లాధికారి కార్యాలయంలో . సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 12వ తేదీ నుండి 19వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ జరిగిందని, మొత్తం 19 నామినేషన్లు రాగా, 20వ తేదీన జరిగిన పరిశీలనలో 11మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. సోమవారం బీజేపీ అభ్యర్థి శ్రీరాములు సతీమణి బి.భాగ్యలక్ష్మి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల బరిలో 10మంది అభ్యర్థులు

ఉపసంహరణల అనంతరం జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల్లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుకారాం, బహుజన సమాజ పార్టీ అభ్యర్థి వాల్మీకి కృష్ణప్ప, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బి.శ్రీరాములు, కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి సి.చెన్నవీర, సోషియలిస్ట్ యూనిటి సెంటర్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్ట్) పార్టీ అభ్యర్థి ఎ.దేవదాస్, ప్రహర్ జనశక్తి పార్టీ అభ్యర్థి మంజప్ప, నవభారత్ సేన పార్టీ అభ్యర్థి జి.స్వామి, స్వతంత్ర అభ్యర్థులు అరుణ్ ఎస్.హిరేహాల్, వై. పంపాపతి, వీరేష్‌లు బరిలో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను అందజేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు:

ప్రస్తుతం వేసవిలో ఎండలు విపరీతంగా ఉండడంతో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందులో తాగునీటి వ్యవస్థ, నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేసినట్లు, వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు 40 సఖి మహిళా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 12 ఎథ్నిక్, 8 విశేష చేతన, 8 యువ పోలింగ్ కేంద్రాలతో పాటు 8 థీమ్ ఆధారిత పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా స్వీప్ సమితి ఆధ్వర్యంలో ఇప్పటికే అవసరమైన జాగృతి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల్లో అక్రమాలు అరికట్టేందుకు 1950 టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోడ్ ఉల్లంఘించడం, డబ్బులు, కానుకలు పంపిణీ చేయడం లాంటివి కనిపిస్తే టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయొచ్చని లేదా సి-విజిల్ ఆప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్

ఎన్నికల ప్రచారంలో పిల్లలను ఉపయోగించడం నేరం

ఎన్నికల ప్రచార కార్యక్రమంలో 18ఏళ్ళు నిండని పిల్లలను వినియోగించుకుంటే జాతీయ పిల్లల హక్కుల కమిషన్, ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం ఆయా పార్టీలు, అభ్యర్థులపై చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని జిల్లాధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లాధికారి మహ్మద్ ఝుబేర్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో గాలివాన విధ్వంసం

●ఈదురు గాలులకు విరిగిపడిన చెట్లు ● విద్యుత్ వైర్లు తెగిపడి నిలిచిపోయిన విద్యుత్ సరఫరా



మీనాక్షి సర్కిల్ వద్ద రోడ్డుపై విరిగిపడిన చెట్టు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 22 : బళ్లారి నగరంలో సోమవారం సాయంత్రం విపరీతమైన ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన రావడంతో రోడ్డుకు ఇరువైపులా వున్న చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. అదేవిధంగా బెంగళూరు రోడ్డులో మీనాక్షి సర్కిల్ వద్ద గాలి విధ్వంసంతో చెట్లు విరిగిపడి కరెంటు తీగలపై పడి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా బహుళ అంతస్తు భవనాల పైకప్పులు దెబ్బతిన్నాయి.

పిడుగుపాటుకు మృతి చెందిన మూగజీవాలు

కంప్లి, ఏప్రిల్ 22 : కొట్టూరు తాలుకా హారాల గ్రామంలో ప్రకాష్ అనే రైతుకు చెందిన మూడు జెర్సీ ఆవులు సోమవారం పిడుగుపాటుకు మృతి చెందాయి. వెంటనే అక్కడకు చేరుకున్న పశుసంవర్థక అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికాలరులకు తెలియజేస్తామని తెలిపారు. మూడు ఆవులు మృతి చెందడంతో దాదాపు రూ. 2 లక్షలు మేర నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని నష్టపోయిన రైతు ప్రకాష్ కోరారు.

ఓటర్లను ఆకర్షించేందుకు పార్టీల కసరత్తు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 22: బళ్లారి లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రత్యక్ష పోటీనెల కొంది. ఇరు పార్టీల అభ్యర్థులు ఆయా కుల సంఘాల నేతలను సంప్రదించి సామాజిక వర్గ ప్రాతిపదికన ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.

బళ్లారి నియోజకవర్గంలో షెడ్యూల్డ్ కులాలతో పాటు వీరశైవ లింగాయత్, మైనారిటీ, ఎస్సీ, కురుబ, క్రిస్టియన్, బ్రాహ్మణ, కమ్మ, గంగామత, ఉప్పర, బలిజ, యాదవ్ లంబాలీల ఓట్లకు ప్రాధాన్యం పెరిగింది. కాంగ్రెస్, బీజేపీ వర్గాల నేతలు వారి అభిమానాన్ని చూరగొనేందుకు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు.

-పోటాపోటీగా లింగాయత్ నేతలు

బళ్లారి లోక్‌సభ నియోజకవర్గంలో అతి పెద్ద సామాజికవర్గంగా గుర్తింపు పొందిన వీరశైవ లింగాయత్ సామాజిక వర్గ ఓట్లను ఆకట్టుకునేందుకు రాజకీయ నేతలు ముందుకొచ్చారు. ఇటీవల నామినేషన్ పత్రాల సమర్పణలో ఈవర్గాన్ని టార్గెట్ చేసుకున్న ఇరు పార్టీలు ఆ సామాజికవర్గానికి చెందిన ప్రముఖులను తీసుకొచ్చి ఓట్లు దండుకునే ప్రయత్నం చేశాయి.

నియోజకవర్గంలో కాంగ్రెస్, భాజ పా అభ్యర్థులు ఒకవైపు ప్రచారం నిర్వహిస్తునే ప్రజాసంఘాల నాయకులతో సమావేశమై పలు వాగ్దానాలు చేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సంఘం నాయకులను గుర్తించి బాధ్యతను ఆ నేతలకు అప్పగిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆయా పార్టీల్లోని వివిధ సంఘాలు నేతలపై ఒత్తిడి తెచ్చి ఓట్లు చీలిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా వారికే అప్పగించారు. దీంతో జిల్లాలోని లోక్‌సభ నియోజకవర్గంలో ఏ వర్గీయులు ఏ పార్టీకి మద్దతు ఇస్తారనే దానిపై కూడా సర్వత్రా ఆసక్తి నెలకొంది. వ్యక్తిగత ఓటుకు, నోటుకే ప్రాధాన్యతనిస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు.

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరాలయ నిర్మాణానికి భూమిపూజ

సిరుగుప్ప, ఏప్రిల్ 22 : శ్రీలక్ష్మీ వెంకటేశ్వరాలయ నిర్మాణానికి పట్టణ ప్రముఖులు సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం బళ్లారి రోడ్డు మార్గంలో సోమవారం వేదపండితుల ఆధ్వర్యంలో హోమం జరిపి శంకుస్థాపన నిర్వహించారు. శంకుస్థాపనకు వేలాది మంది తరలివచ్చారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సత్యనారాయణ దంపతులు లక్ష్మీవెంకటేశ్వర ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేయగా, డీవీఎస్ నాయుడు దంపతులు భూదేవి ఆలయ నిర్మాణానికి పూజలు చేశారు. కాంట్రాక్టర్ నాగరాజు దంపతులు శ్రీదేవి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. గణేష, రామచంద్రలు కూడా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వేత్తలు ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఫౌండర్ కొల్లి శ్రీనివాసరావు, రఘుకిరణ్, ప్రతాప్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీవెంకటేశ్వరాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సత్యనారాయణ దంపతులు

రూరల్ పరిధిలో మంత్రి నాగేంద్ర ప్రచారం



బెళగల్లులో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్న మంత్రి నాగేంద్ర

బళ్లారిరూరల్, ఏప్రిల్ 22 : బళ్లారిరూరల్ పరిధిలోని గ్రామీణ క్షేత్రంలో సోమవారం బెలగల్లు, బెలగల్లు తాండా, అరిగిణదోణి, జానెకుంట తదితర గ్రామాలలో బళ్లారి ఇన్‌ఛార్జి మంత్రి నాగేంద్ర లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారామ్ గెలుపు కోసం విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారెంటీల వల్ల రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, పేద, బడుగు, బలహీన వర్గాలకు ఈ ఐదు గ్యారెంటీలవల్ల మహిళలకు ఉచిత బస్సు పాస్, ఉచిత కరెంటు, ప్రతి మహిళకు రూ. 2 వేలు, విద్యాకానుక, ఉచిత రేషన్ అందిస్తుందన్నారు. తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలను సక్రమంగా అమలు చేసిందని అందువల్ల ప్రజలంతా కాంగ్రెస్‌కు మద్దతుగా వున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మంజుళ, కాంగ్రెస్ నాయకులు చిన్న బసవరాజు, మహారుద్రగౌడ, మానయ్య, వెంకటేష్ ప్రసాద్, నాని, గోవర్ధన్ రెడ్డి, వన్నప్ప, వన్నూరప్ప, జగన్నాథ్, మారెన్న, ముద్దమల్లయ్య, నాగభూషణ గౌడ, తదితరులు పెద్దఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకై ప్రచారం



కంప్లి, ఏప్రిల్ 22 : కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారామ్ గెలుపు కోసం కుమార్తె చైతన్య, భార్య జయలక్ష్మీలు కంప్లి నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. బీజేపీ నాయకులు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే హామీలు ఇస్తున్నారన్నారు. అనంతరం అటు వైపు కూడా తిరిగి చూడరన్నారు. శాసనసభ ఎన్నికల్లో తమ ప్రభుత్వం అందించే పథకాలు ప్రజలకు చేరాయన్నారు. అలాగే తమ అభ్యర్థి ఈ తుకారామ్‌ను లోక్‌సభకు గెలిపిస్తే పూర్తిగా ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామన్నారు. కంప్లి తాలుకాలోని రామసాగరం, ముద్దాపురం, చిక్కజాగనూరు, దేవసముద్రం, ముద్దాపురం, తదితర గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్, బసవరాజు, ఆశాలత, తిమ్మారెడ్డి, సుదీప్, కరిబసవనగౌడ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజోపయోగ పనులు చేపట్టాలి

కంప్లి, ఏప్రిల్ 22 : గ్రామాల్లో జరిపే ఉపాధి హామీ పనులతో ప్రజలకు ఉపయోగపడేలా పనులు జరపాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ కమీషనర్ పవన్ కుమార్ మాలపాటి తెలిపారు. సోమవారం కంప్లి తాలుకాలో ఉపాధి హామీ కూలీల ద్వారా జరిగిన పనులను పరిశీలించారు. సన్నాపురం, దేవసముద్రం, సోమలాపురం తదితర గ్రామాలలో జరిగిన పాఠశాల ప్రహరీగోడ పనులను పరిశీలించారు.

నేహా హత్యకు నిరసనగా రేపు గంగావతి బంద్

గంగావతి రూరల్, ఏప్రిల్ 22: నేహా హిరేమఠ్ హత్యకు పాల్పడిన ఫయాజ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ లౌకిక పార్టీలకతీతంగా అన్ని సంఘాలు బుధవారం గంగావతి బంద్‌కు పిలుపు నిచ్చాయని హిందూ సంస్థల నాయకుడు సంతోష్ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంగావతి తాలూకా పౌరులంతా ఉదయం 8గంటలకు ఏపీఎంసీకి తరలివచ్చి ఊరేగింపుగా గాంధీ సర్కిల్‌కు చేరుకుని అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తారని తెలిపారు. ఈసందర్భంగా కాడా మాజీ అధ్యక్షుడు తిప్పేరుద్రస్వామి మాట్లాడుతూ ఈ ఘటనను సీఎం, డిసీఎం, హోంమంత్రి సీరియస్‌గా తీసుకోలేదని, వారు తేలికగా చేసిన వ్యాఖ్యలు చాలా బాధించాయన్నారు. తనను పెళ్ళి చేసుకోవాలని నేహాను ఫయాజ్ నిత్యం వేదించేవాడని, ఆమె తిరస్కరించినందుకు హత్య చేశాడని, నిందితుడికి ప్రత్యక్ష శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. గంగావతి విద్యా రంగానికి కేంద్రంగా మారుతోందని, వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు చదువుల కోసం ఇక్కడికి వస్తుండటంతో అందరి భద్రత దృష్ట్యా ఆలోచించాలన్నారు. ఈసందర్భంగా వ్యాపారవేత్త వెంకటేశ్ అమరజ్యోతి, న్యాయవాది నాగరాజ్ గుత్తేదార్, మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు హుసేనప్ప, సంగమేశ్, అయ్యనగౌడ్, మహంతేశ్,శరణయ్య, షరబయ్య తదితరులు పాల్గొన్నారు.

హంతకుడిని కఠినంగా శిక్షించండి



తహసీల్దార్‌కు మనవిపత్రం ఇస్తున్న వీరశైవ సమాజ మహిళలు

కంప్లి, ఏప్రిల్ 22 : హుబ్బళ్లిలో విద్యార్థినిని అమానుషంగా కత్తితో పొడిచిన హంతకుడిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మాహితీ హక్కు సామాజిక కార్యకర్తల వేదిక ఆధ్వర్యంలో వీరశైవ సమాజం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా అధ్యక్షులు రాజ్‌కుమార్, మూకయ్యస్వామిలు ఇరువురు మాట్లాడుతూ నేహాను కళ్లెదురుగా హతమార్చిన హంతకుడిని వెంటనే శిక్షించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న నేరాలను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. తమ పనులపైన విద్యార్థులు గానీ, మహిళలు గానీ బయటకు వెళ్లాలంటే ప్రమాదకరంగా మారిందని వాపోయారు. వెంటనే నేహా కుటుంబానికి ప్రభుత్వం అండగా వుంటూ రాష్ట్రంలో మరోసారి ఇలా జరుగకుండా చూడాలని ముఖ్యమంత్రికి రాసిన లేఖను మహిళలు తహసీల్దార్ శివరాజ్‌కు అందించారు. వీరితో పాటు హేమయ్యస్వామి, అరివి బసవనగౌడ, పురసభ మాజీ అధ్యక్షురాలు శాంతల, మమత, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

వన్యప్రాణులకు ప్రత్యేక నీటి తొట్టెలు



కృత్రిమ తొట్టెలో నీరు తాగుతున్న ఏనుగులు

హోసూరు, ఏప్రిల్ 22: ఎండలు మండుతున్న తరుణంలో వన్యప్రాణులకోసం ప్రత్యేకంగా నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. శానమావు, శూలగిరి, తళి అటవీప్రాంతంలోని జవలగిరి, అంచెట్టి ప్రాంతాలలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేలా అన్ని చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దులో శూలగిరి అటవీప్రాంతం, కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో జవలగిరి అటవీప్రాంతంలో ఏనుగులు, జింకలు, ఇతర వన్యప్రాణులు నీటి కోసం గ్రామాలవైపు వస్తున్నాయని గుర్తించి ఈ చర్యలు చేపట్టారు. 20కుపైగా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తొట్టెల్లో ఎప్పటికప్పుడు నీటిని నింపుతున్నట్లు తెలిపారు. అలాగే సదరు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. వన్యప్రాణులకు ఇబ్బంది కలిగించేలా ఎవరు వ్యవహరించినా చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు.

బిచ్చగాళ్లకు అడ్డుకట్ట వేయండి

హోసూరు, ఏప్రిల్ 22: హోసూరులోని రద్దీ ప్రాంతాల్లో భిక్షాటన చేసేవారు అధికమయ్యారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, మార్కెట్ తదితర ప్రాంతాల్లో చిన్నబిడ్డలతో బిచ్చమెత్తుకునేవారు ఎక్కువయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. హోసూరు పారిశ్రామిక నగరం కావడంతో ఇతర రాష్ట్రాలకు చెందినవారు పెద్దసంఖ్యలో పనిచేస్తున్నారు. ఎండలో చిన్నబిడ్డలను ఎత్తుకుని బిచ్చమెత్తడం వల్ల దీని ప్రభావం ఇతరుల మనస్సులో దుష్ప్రభావం చూపే అవకాశం ఉందని, ప్రత్యేకించి అద్దె బిడ్డలతో బిచ్చమెత్తుతున్నారని విమర్శలు ఉన్నాయి. ఇలాంటి బిచ్చగాళ్ల ముఠాకు అడ్డుకట్ట వేయాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

పండుగకు పూల విక్రయాల జోరు

హోసూరు, ఏప్రిల్ 22: చైత్ర పౌర్ణమి నేపథ్యంలో పలు చోట్ల ఉత్సవాలు సాగుతుండడంతో పూలధరలు పెరిగాయి. హోసూరు మార్కెట్‌లో రెండు రోజులుగా పూల విక్రయాలు జోరుగా సాగాయి. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు, డెంకణకోట, తళి, కెలమంగల తదితర ప్రాంతాలలో బంతిపూలు, చెండుమల్లి, గులాబీలు తదితర రకాలు సాగు చేస్తున్నారు. వేసవి కావడంతో సాధారణం కంటే దిగుబడి తక్కువగా ఉన్నప్పటికీ పూల ధరలు ఆశాజనకంగా ఉండి గిట్టుబాటు ధర లభించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. కనకాంబరం కిలో రూ.వెయ్యి, మల్లి రూ.400, రోజా రూ.150, చెండుమల్లి రూ.80, చేమంతి రూ.250, అరళి రకం కిలో రూ.300 వరకు పలికింది.



మార్కెట్‌లో పూలను విక్రయిస్తున్న దృశ్యం

నిరుపేదలకు మోదీ చేసింది శూన్యం: స్లంవాసుల కమిటీ

రాయచూరు, ఏప్రిల్ 22 : గడచిన 10 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనలో మురికివాడల్లో నివశించే వారికి నిరుపేదలకు ఒరిగిందేమీ లేదని కర్ణాటక స్లం వాసుల కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఏ నరసింహమూర్తి అన్నారు. వికసిత భారత్ పేరుతో బీజేపీ నాయకులు చెబుతున్న గణాంకాలు కార్పోరేట్ ప్రైవేటు శక్తులకేగాని పేదలకు మేలు చేసిందేమి లేవదన్నది స్పష్టమన్నారు. స్లం వాసుల్లో అవగాహన కల్పించేందుకోసం ఉద్దేశించిన కరపత్రాలను నరసింహ నాయక్ సోమవారం నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన దేశంలోని 80 శాతం వరకు ఉన్న పేదలు మధ్యతరగతి ప్రజలు ముఖ్యంగా మురికివాడల్లో నివశించే వారు రాజ్యాంగ పరిరక్షణ కోసం మోదీకి వ్యతిరేకంగా పని చేయాలని పిలుపునిచ్చారు. జీఎస్టీతో ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్న మోదీ ప్రభుత్వం వారి సంక్షేమం కోసం చేసిందేమీ లేకపోగా అనేక సంక్షేమ పథకాలను రద్దు చేయడం ద్వారా నిరుపేదల గొంతునొక్కిందన్నారు. వికసిత భారత్ పేరుతో నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ప్రజలను మోసగించడమేగాక విశ్వగురు పేరుతో ప్రజలను ఆకట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు మరో సారి ఓటర్లను మభ్యపెట్టేందుకేనన్నారు.

నేహా హత్య పై బీజేపీ శ్రేణుల నిరసన



మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్

రాయచూరు, ఏప్రిల్ 22 : హుబ్లీలోని కళాశాల ఆవరణలోనే యువతి నేహ హిరేమఠను కత్తితో పొడిచి దారుణంగా చంపిన నిందితుడు ఫయాజ్‌కు ఉరి శిక్ష విదించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటీల్ డిమాండ్ చేశారు. నేహా హత్యను నిరశిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటీల్, కాంగ్రెస్ ప్రభుత్వం మయాంలో శాంతిభద్రతలు క్షీణించాయనేందుకు నేహా హత్య ప్రత్యేక్ష ఉదహారణ అన్నారు. ఈ సంఘటనతో పాఠశాలలు, కలాశాలల్లో విద్యార్థులు అభద్రత భావంతో భయపడుతున్నారని దీనిపై ప్రభుత్వం నుంచి వస్తున్న స్పందన నిరాజనకంగా ఉండడం దురదృష్టకరమన్నారు. పైగా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి వ్యక్తిగత కక్షతోనే హత్య జరిగిందంటూ తేలికగా వ్యాఖ్యానించడం దౌర్భాగ్యమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. నేహా కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటీల్ డిమాండ్ చేశారు.